క్లుప్తంగా

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ



రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీఓ జాన్ ఇర్విన్

చింతకొమ్మదిన్నె : మండలంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం ఆర్డీఓ జాన్ ఇర్విన్ ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ నాగేశ్వరరావుతో మాట్లాడుతూ మండలంలో ఫ్రీ హోల్డ్ భూముల రి వెరిఫికేషన్ ప్రోగ్రెస్‌ను అడిగి తెలుసుకున్నారు. పలు గ్రామాల్లోని సమస్యలను తహసీల్దార్ ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కార్యాలయంలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వోలు పాల్గొన్నారు.

పులివెందుల ఆర్డీఓగా భానుశ్రీ



పులివెందుల టౌన్ : పులివెందుల రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్‌గా భానుశ్రీ అన్నపూర్ణ ప్రత్యూష శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. పశ్చిమ గోదావరి జిల్లా ఎటపాక పట్టణానికి చెందిన భానుశ్రీ గ్రూప్–1 ఫలితాలలో ఎంపికై ట్రైనింగ్ పూర్తి చేసుకుని పులివెందుల ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఆర్డీఓ వెంకటేశులును జీఏడీకి అటాచ్ చేశారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా రామాంజనేయులు



పులివెందుల రూరల్ : స్థానిక మండల పరిషత్ డెవెలప్‌మెంట్ కార్యాలయంలో శనివారం ఇన్ చార్జి ఎంపీడీఓగా రామాంజనేయులు పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీఓగా పని చేస్తున్న వెంకటేష్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రాజుపాలెం ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓగా పనిచేస్తున్న రామాంజనేయులు బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పులివెందుల మండలంలో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈగా శ్రీనివాసులరెడ్డి



కమలాపురం : స్థానిక ఆర్ డబ్ల్యూఎస్ డీఈఈ గా శ్రీనివాసులరెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. రాయచోటీ నుంచి బదిలీపై కమలాపురంకు ఆయన వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న డీఈఈ రాయచోటికి బదిలీ అయ్యారు. ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఎక్కడైనా తా గునీరు, డ్రైనేజ్ తదితర సమస్యలుంటే తక్షణం పరిష్కరిస్తానన్నారు. ప్రజలు తాగునీటి తదితర ఎలాంటి సమస్యలున్నా తమ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

వెలుగు ఏపీఎంగా గంగాధర్



కమలాపురం : స్థానిక వెలుగు ఏపీఎంగా గంగాధర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. చెన్నూరు ఏపీఎంగా విధులు నిర్వర్తిస్తూ కమలాపురంకు బదిలీపై వచ్చారు. ఇక్కడ ఏపీఎంగా పనిచేస్తున్న అపర్ణ ముద్దనూరుకు బదిలీ అయ్యారు. స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. అలాగే ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసేందుకు తన వంతు సేవలు అందిస్తానన్నారు.

ఈఓపీఆర్‌డీగా కెజియా



కమలాపురం : స్థానిక ఈఓపీఆర్‌డీగా ఎల్.కెజియా శని వారం బాధ్యతలు చేపట్టారు. డ్వామా సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఆమె కమలాపురం ఈఓపీఆర్‌డీగా వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న శారదారెడ్డి పులివెందులకు బదిలీపై వెళ్లారు. మండలంలోని అన్ని గ్రామా ల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, రోడ్లు, వీధి దీపా లు తదితర మౌలిక సదుపాయాలపై ఎలాంటి సమస్యలున్నా తక్షణం స్పందించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

నేత్రదానం మహా పుణ్యకార్యం

పులివెందుల రూరల్ : అంధులకు చూపునిచ్చే నేత్రదానం మహా పుణ్యకార్యమని పులివెందుల జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సీనియర్ న్యాయవాది కరుణాకర్‌రెడ్డి సోదరి గోకనపల్లి తులసీదేవి ఇటీవల మరణించడంతో నేత్ర సేకరణ కేంద్రం ఆధ్వర్యంలో ఆమె కళ్ళను దానం చేయడం జరిగింది. శనివారం పట్టణంలోని స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఛాంబర్‌లో సీనియర్ న్యాయవాది కరుణాకర్‌రెడ్డికి మేజిస్ట్రేట్ చంద్రశేఖర్‌రెడ్డి, నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షుడు రాజుల చేతులమీదుగా జ్ఞాపికను అందించి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పులివెందుల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహారెడ్డి, ప్రొద్దుటూరు సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శ్రీనివాసులు, సీనియర్ న్యాయవాది రామ్మోహన్, సేవాసమితి ప్రధాన కార్యదర్శి హేమలత, నేత్రసేకరణ కేంద్రం టెక్నీషియన్ హరీష్, సభ్యులు రాజా, విజయ తదితరులు పాల్గొన్నారు.

రైతులను నిరాశపరుస్తున్న ఉల్లి ధరలు

- ఎకరాకు రూ.60 వేలకుపైనే పెట్టుబడులు
- తెగుళ్లతో సాగులో తగ్గుతున్న దిగుబడులు
- ఈ ధరలతో పెట్టుబడులు కూడా రావని ఆవేదన
- ఆందోళన చెందుతున్న ఉల్లి రైతులు



ఉల్లి గడ్డలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

వేముల : ఈ ఏడాది ఉల్లి ధరలు రైతులను నిరాశపరుస్తున్నాయి. గత వారం రోజుల క్రితం ఉన్న ధరలు ఇప్పుడు తగ్గుముఖం పట్టడంతో ఉల్లి రైతులు ఆందోళనకు గురవుతున్నారు. దిగుబడులు ప్రారంభంలో ఆశాజనకంగా ఉల్లి ధరలు ఉండేవి. అయితే బయట మార్కెట్‌లో ధరలు తగ్గడంతో ఇక్కడి వ్యాపారులు కూడా ఉల్లి ధరలు తగ్గించేశారు. ఈ ఏడాది ఉల్లి ధర లు బాగా ఉంటాయని రైతులు ఆశించారు. నియోజకవర్గ వ్యాప్తంగా 3 వేల ఎకరాలలో ఉల్లి పంట సాగైంది. ముందుగా దిగుబడులు చేతికొచ్చినా రైతులు ఆదాయం కళ్లజూశారు. ఇప్పుడు ధరలు తగ్గడంతో రైతులు ధరల పెరుగుదల ఉంటుందని ఎదురుచూస్తున్నారు.

ఎకరాకు రూ.60 వేలకుపైనే పెట్టుబడులు :

ఉద్యాన పంటలలో అరటి తర్వాత పెట్టుబడులతో కూడుకున్నది ఉల్లి పంట. పంట కాలం నాలుగు నెలలు ఉంచినప్పటికి పెట్టుబడులు అవుతున్నాయి. పంట సాగు మొదలు దిగుబడులు వచ్చే వరకు పెట్టుబడులు పెట్టాల్సి వస్తోందని రైతులు అంటున్నారు. ధరలు ఉంటాయనే ఆశతో రైతులు పెట్టుబడులకు వెనుకాడటంలేదు.

తెగుళ్ల నివారణకు అధిక ఖర్చు :

ఈ ఏడాది ఉల్లి పంటకు తెగుళ్లు, చీడ పీడలు విపరీతంగా సోకాయి. ఇందుకోసం రైతులు అధికంగా ఖర్చు చేశారు. ఒక్క రైతు 8 నుంచి 10 సార్లు ఉల్లి పంటకు మందులు కొట్టడం, గడ్డ బాగా ఉండాలనే రసాయనిక ఎరువులకు ఎక్కువ ఖర్చు అయ్యిందని అంటున్నారు. మందుల, రసాయనిక ఎరువుల కోసం ఎకరాకు రూ.20వేలకు పైనే ఖర్చు చేశామని రైతులు చెబుతున్నారు.

తెగుళ్లతో తగ్గిన దిగుబడులు :

ఉల్లి పంటకు తెగుళ్ల దెబ్బతీయడంతో దిగుబడులు కూడా తగ్గుతున్నాయి. పంట కాలం పూర్తిదశలో కూడా తెగుళ్ల సోకడంతో రైతులు మందులను పిచికారి చేయాల్సి వచ్చింది. అధిక ఎండలు, వాతావరణంలో మార్పులతో పంట దెబ్బతినడంతో దిగుబడులు తగ్గుతున్నాయని రైతులు అంటున్నా రు. మామూలుగా ఎకరాకు 80 నుంచి వంద క్వింటాళ్ల వరకు దిగుబడులు ఉండేవని. తెగుళ్లతో 60 నుంచి 70 క్వింటాళ్లు కూడా దిగుబడులు వచ్చే ప రిస్థితి లేదని రైతులు చెబుతున్నారు.

తగ్గిన ఉల్లి ధరలతో నష్టాలే..

ఉల్లి దిగుబడులు వచ్చిన ప్రారంభంలో ఉల్లి ధరలు ఉండటంతో ఆదాయం ఉంది. నష్టాల నుంచి బయట పడతామని రైతులు ఆశించారు. ఉల్లి దిగుబడులు వచ్చిన మొదట్లో క్వింటా ఉల్లి రూ.4 వేలతో వ్యాపారులు కొనుగోలు చేశారు. ముందుగా ఉల్లి సాగు చేసుకున్న తోటలలో ముందుగానే దిగుబడులు చే తికొచ్చాయి. దీంతో కొంతమంది రైతులు ఉల్లిలో ఆదాయం చూశారు. వెనుక ఉల్లి సాగు చేసిన తోటలలో దిగుబడులు ఇంకా చేతికి అందలేదు. మార్కెట్‌లో ప్రస్తుతం క్వింటా ఉల్లిని రూ.2వేలతో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు.

రెండు ఎకరాలలో ఉల్లి సాగు చేశా..



నాకున్న రెండు ఎకరాలలో ఉల్లి సాగు చేశా. సాగు లో రూ.1.50 లక్షల వరకు పెట్టుబడులు పెట్టా. ఉల్లి గడ్డలు పీకేందుకు ధరలు లేకపోవడంతో వెనుకాడుతున్నాం. మరో వారం, పది రోజులలో ధరలు వస్తాయనే ఆశతో ఉన్నాం. ప్రస్తుతం క్వింటా ఉల్లి రూ.2,400లతో వ్యాపారులు అడుగుతున్నారు. ఈ ధరలతో ఉల్లి గడ్డలు అమ్మితే నష్టపోతాం.

– గంగాధర (ఉల్లి రైతు), వేముల

రూ.3 లక్షలకుపైనే పెట్టుబడులు పెట్టా..



ఉల్లి సాగులో రూ.3 లక్షలకుపైనే పెట్టుబడులు పెట్టా. నాకున్న 5 ఎకరాలలో ఉల్లి సాగు చేశా. మరో వారం, పది రోజులలో ఉల్లి గడ్డలు పీకివేయాలి. ధరలు లేకపోవడంతో ధరల కోసం ఎదురుచూస్తున్నాం. ముందుగా దిగుబడులు వచ్చే సమయంలో ఉన్న ధరలు ఇప్పుడు లేకపోవడంతో సాగులో నష్టాలను చవి చూస్తున్నాం.

– చంద్ర ఓబుళరెడ్డి(ఉల్లి రైతు), గొందిపల్లె

చోరీల నివారణకు కరపత్రాలు పంపిణీ



కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేస్తున్న సీఐ, ఎస్ఐలు

పులివెందుల రూరల్ : చోరీల నివారణకు కరపత్రాలను పంపిణీ చేస్తున్నట్లు అర్బన్ సీఐ జీవన్ గంగానాథ్ బాబు తెలిపారు. శనివారం పట్టణంలోని స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఆయనతోపాటు ఎస్ఐ నారాయణలు చోరీల నివారణకు ముద్రించిన కరపత్రాలను విడుదల చేసి ప్రజలకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చోరీలు, మోసాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు కరపత్రాలు పంపిణీ చేశామన్నారు. వీధుల్లో ఎవరైనా అనుమానాస్పదస్థితిలో సంచరిస్తున్నట్లు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

నేడు జాయింట్ కమిషనర్ రాక

లింగాల : స్థానిక ఎంపీడీఓ కార్యాలయానికి ఆదివారం ఉదయం 7 గంటలకు జాయింట్ కమిషనర్ (టెక్నికల్) శివప్రసాద్ వస్తున్నారని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలస్థాయి అధికారులు ఎంపీడీఓ కార్యాలయానికి హాజరు కావాలని ఆదేశించారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా

– ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు : వైఎస్సార్‌సీపీ ప్రతి కార్యకర్తకు తాను అండగా ఉంటానని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి తెలిపారు. శనివారం నారాపురస్వామి దేవాలయం సమీపంలో నూతన పార్టీ కార్యాలయాన్ని నాయకులు, కార్యకర్తలతో కలసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. పార్టీ కార్యకర్తలు, నాయకులపై దాడులు జరిగితే న్యాయం జరిగేవరకు పోరాటం చేస్తామన్నారు. పోలీసు వ్యవస్థ సక్రమంగా పనిచేయకపోతే ఉద్యమిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలలో ఒక్కటికూడా అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. వెంకటేశ్వరస్వామి లడ్డుపై అసత్యప్రచారం చేస్తూ హిందూవుల మనోభావాలను దెబ్బతిసేవిధంగా వ్యవహరించారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలన్నారు. త్వరలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రవీంద్రారెడ్డిలతో కలసి కార్యకర్తలతో సమావేశాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం టీటీడీ కల్యాణ మండపం వద్ద ఉన్న మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు గిరిధర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, వెంకటశివారెడ్డి, ఉప్పలపాడు శ్రీనివాస రెడ్డి, హనుమంతరెడ్డి, కొమ్మెర్ల మోహన్‌రెడ్డి, కేకే రమణారెడ్డి, వద్దిరాల రామాజంనేయుల యాదవ్, ముల్లాజానీ, తదితరులు పాల్గొన్నారు.



పార్టీ కార్యాలయంలో పూజలు చేస్తున్న రామసుబ్బారెడ్డి దంపతులు

మద్యం షాపులకు దరఖాస్తుల ఆహ్వానం

పులివెందుల రూరల్ : మద్యం షాపులకు సంబంధించి పారదర్శకంగా టెండర్ల పక్రియ నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ చెన్నారెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని స్థానిక ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పులివెందుల ప్రాంతంలోని పలు మండలాలకు 16 మద్యం షాపులు మంజూరుకాగా, అందులో పులివెందులకు 7, వేంపల్లెకు 5, వేముల, చక్రాయపేట ఒకటి చొప్పున, లింగాల మండలానికి రెండు మద్యం షాపులు మంజూరయ్యాయన్నారు. 50 వేల కంటే జనాభా అధికంగా ఉన్న పులివెందుల, వేంపల్లెలకు రూ.65 లక్షల లైసెన్స్ ఫీజు ఉంటుందన్నారు. మిగిలిన మండలాలకు రూ.55 లక్షల ఉంటుందన్నారు. దరఖాస్తు ఫీజు రూ.2 లక్షల ఇఎండీ లేకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 9వ తేదీ వరకు దరఖాస్తుకు సమయం ఉందని, 11వ తేదీ లాటరీ పద్ధతిలో జిల్లా పరిషత్ కార్యాలయంలో కలెక్టర్ ఆధ్వర్యంలో టెండర్లు డ్రా తీస్తారన్నారు. ఆసక్తి గలవారు ఎవరైనా ఆన్‌లైన్‌లో మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు.

ఎర్రగుంట్ల..

ఎర్రగుంట్ల : స్థానిక ఎక్సైజ్ పరిధిలో ఉన్న 14 మద్యం షాపుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎర్రగుంట్ల ఎక్సైజ్ శాఖ సీఐ గోపి కృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. షాపులకు ఈనెల 9వ తేదీ చివరి గడువు అని తెలిపారు. మున్సిపల్ పరిధిలో 5, రూరల్ పరిధిలో 3 షాపులు, కమలాపురం మున్సిపల్ పరిధిలో 1 షాపు, కమలాపురం రూరల్ పరిధిలో 3 షాపులు, వీరపునాయినిపల్లెలో 1 షాపు, వల్లూరు మండలంలో 1 షాపు కలిపి మొత్తం 14 షాపులకు టెండర్లు దరఖాస్తులు ఆన్‌లైన్ పద్ధతిలో చేసుకోవచ్చన్నారు. ఈ పాలసీ ప్రకారం ఒక దరఖాస్తుదారుడు ఎన్ని షాపులకైనా దరఖస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 11వ తేదీన జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో డిప్ తీస్తారన్నారు. దరఖాస్తులను ఈనెల 9వ తేదీ సాయంత్ర వరకు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు 9440902 600 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

జమ్మలమడుగు ..

జమ్మలమడుగు రూరల్ : పట్టణ, రూరల్ ప్రాంతాల్లో నూతన మద్యం దుకాణాల లైసెన్స్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ సరితారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జమ్మలమడుగు నగర పంచాయతీ పరిధిలో 8 షాపులు, రూరల్ పరిధిలో 2 దుకాణాలు, మైలవరం మండల పరిధిలో 3, పెద్దముడియం మండల పరిధిలో 1 దుకాణంనకు లైసెన్స్‌లు జారీ చేసినట్లు ఆమె తెలిపారు. దరఖాస్తుదారుడు నాన్ రిఫండబుల్ దరఖాస్తు కింద రుసుం రూ.2 లక్షలు చెల్లించవలసి ఉంటుందన్నారు. వివరాలకు 9440902601కు సంప్రదించాలని ఆమె తెలిపారు.

ముద్దనూరు..

ముద్దనూరు : స్థానిక ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్ పరిధిలోని 7 మద్యం దుకాణాల ఏర్పాటుకు ఆసక్తి కల వారు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ విన్నీలత తెలిపారు. సర్కిల్ పరిధిలోని ముద్దనూరులో 2 మద్యం దుకాణాలకు, కొండాపురం మండలంలో 2 దుకాణాలకు, సింహాద్రిపురం మండలంలో 2 దుకాణాలకు, తొండూరు మండలంలో 1 దుకాణానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రేపటి నుంచి బుడ్డశనగ విత్తనాలు పంపిణీ

కొండాపురం : రబీ సీజన్‌లో సాగు చేసిన రైతులకు సోమవారం నుంచి బుడ్డశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి ఏపీ రామంజులరెడ్డి తెలిపారు.

శనివారం కొండాపురంలోని రైతుబరోసా–2 కేంద్రంలో మండలంలోని అన్ని రైతుబరోసా సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండలంకు 3042 క్వింటాళ్లు శనగలు మంజురయ్యాయి. క్వింటా ధర రూ.9400 సబ్సిడీ 25 శాతం రూ.2350 పోను రైతువాటా రూ.7050 క్వింటా ధర పడుతుందన్నారు. కావాల్సిన రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ తీసుకుని తమ రైతు బరోస సెంటర్‌కు వెళ్లాలన్నారు. 50 సెట్లు ఉంటే 1 ప్యాకెట్, ఎకర ఉంటే రెండు బ్యాగులు, 5 ఎకరాలు ఉంటే 10 బ్యాగుల ఇస్తామన్నారు. ఒక బ్యాగ్ 20 కేజిల ప్యాకెట్ అని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కడప జిల్లాకు తీరని అన్యాయం

పులివెందుల టౌన్ : జిల్లాలోని కొప్పర్తి పారిశ్రామిక వాడలోని టెక్నాలజీ సెంటర్‌ను అమరావతికి తరలింపుతో కడప జిల్లాకు తీరని అన్యాయం జరిగిందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్‌లక్ష్మణ్‌రెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా కోశాధికారి రాఘవేంద్రారెడ్డిలు కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. శనివారం పట్టణంలోని స్థానిక పాత ఎమ్మెల్యే ఆఫీసులో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొప్పర్తిలో టెక్నాలజీ సెంటర్‌కు భూమి ఇవ్వడంతోపాటు సౌకర్యాలు కల్పించి కొప్పర్తికి అనేక పరిశ్రమలు తీసుకొచ్చారన్నారు. అయితే చంద్రబాబు అధికారంలోకి రాగానే ఇక్కడి సంస్థలను అమరావతికి తరలిస్తున్నారన్నారు. కొప్పర్తిలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్‌ను జీఓ నెం .56 ప్రకారం అమరావతికి తరలించడంతో చంద్రబాబు ఇక్కడి నిరుద్యోగులకు ద్రోహం చేయడమేనన్నారు. ఇప్పటికైనా కొప్పర్తి టెక్నాలజీ సెంటర్‌ను వైఎస్సార్ జిల్లాలో కొనసాగించకపోతే ఉద్యమం తప్పదని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగపు సభ్యులు బాగ్యరాజు, హర్షద్, సాయి, శివ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామ్‌లక్ష్మణ్‌రెడ్డి

విలువైన వస్తువులను జాగ్రత్తగా ఉంచుకోవాలి

ఎర్రగుంట్ల : పట్టణ ప్రజలు డబ్బు, విలువైన వస్తువులు, ఆభరణాలు చాలా జాగ్రత్తగా ఉంచుకోవాలని పట్టణ సీఐ నరేష్‌బాబు శనివారం తెలిపారు. దుకాణ యజమానులు రాత్రి ఇంటికి వెళ్లేటప్పుడు షాపులు మూసిన తర్వాత తాళం ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకోవాలని, షాపు బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పగటి పూట అపరిచిత వ్యక్తులు కనిపించినా, రాత్రి వేళ అనుమానంగా సంచరించే వారిని గురించి పోలీసులకు సమాచారం అందించాలన్నారు. విలువైన వస్తువులను పక్కింటి వారికి ఇచ్చి నమ్మి మోసపోవద్దు అన్నారు. ఖరీదైన వస్తువులను బ్యాంక్ లాకర్‌లో పెట్టుకోవాలన్నారు. ఇంటికి చుట్టు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

వృత్తి విద్య ఇంటర్న్‌షిప్ ఉపాధికి తొలిమెట్టు

ఎర్రగుంట్ల : వృత్తి విద్య అనే సబ్జక్టు పాఠశాల స్థాయిలో ఉండటం వల్ల వారి వృత్తి విద్య ఇంటర్న్‌షిప్ ఉపాధికి తొలిమెట్టు అని జిల్లా జీసీడీఓ విజయ కుమారి తెలిపారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఈ ఇంటర్న్‌షిప్‌లో పాల్గొడం వల్ల ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. పదవ తరగతి విద్యార్థులకు ఇది చాలా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రామాంజనేయరెడ్డి, ఒకేషనల్ కో–ఆర్డినేటర్లు కమలాకర్, రఘులు, వృత్తి విద్య ఉపాధ్యాయులు తుపాకుల చంద్ర ఓబుళరెడ్డి ఐటీఐ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు నిత్యావసర సరుకుల పంపిణీ

పులివెందుల టౌన్ : పట్టణంలోని వికలాంగుల కమ్యూనిటీ భవనంలో శనివారం సింగం వెంకట నారాయణరెడ్డి 14వ వర్ధంతిని పురస్కరించుకుని లాయర్ కరుణాకర్‌రెడ్డి 30 మంది దివ్యాంగులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి, వ్యాపారవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

మైలవరం ఎంపీడీఓగా రామచంద్రారెడ్డి

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : మైలవరం మండలం ఎంపీడీఓగా వై.రామచంద్రారెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన కర్నూల్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న షంషాద్‌బాను పెద్దముడియంకు బదిలీ అయ్యారు. ఆయన మాట్లాడుతూ రాబోవు వర్షకాలంను దృష్టిలో పెట్టుకుని అధికారులు పారిశుద్ధ్యం, తాగు నీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

జీవో నెంబర్ 56ను రద్దు చేసే వరకు పోరాటం ఆగదు

వేంపల్లె : కేంద్ర ప్రభుత్వం పారిశ్రామిక కేంద్రంలో ఏర్పాటు చేసిన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల సాంకేతిక కేంద్రంను చంద్రబాబు ప్రభుత్వం సీఆర్డీఏకు తరలిస్తూ తీసుకువచ్చిన జీవో 56ను ఉపసంహరించుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని సీపీఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకటరాములు, సహాయ కార్యదర్శి బ్రహ్మంలు హెచ్చరించారు. శనివారం పట్టణంలో వారు మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ 2006 చట్టానికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ల ఏర్పాటులో భాగంగా కడప జిల్లా కొప్పర్తి పారిశ్రామిక కేంద్రంలో ఏర్పాటు చేయడం ద్వారా నిరుద్యోగ యువతకు ఉపయోగపడుతుందన్నారు. అలాంటి సంస్థను ముఖ్యమంత్రి చంద్రబాబు కడప జిల్లాపై కక్ష సాధింపుతో సీఆర్డీఏకు తరలిస్తూ జీవో నెంబర్ 56ను తీసుకురావడం దుర్మార్గమన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్ర పారిశ్రామిక కారిడార్‌కు కొప్పర్తి పారిశ్రామిక కేంద్రాన్ని అనుసంధానిస్తూ నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటన జిల్లా ప్రజానీకానికి చిగురించిన ఆశలు జీవో నెంబర్ 56 తో ఆవిరైపోయాయన్నారు. చంద్రబాబు పరిపాలనలో రాయలసీమ అనే పేరు వినడానికి కూడా ఇష్టపడటంలేదన్నారు. ప్రాజెక్టుల నిర్మాణంపట్ల చంద్రబాబు వైఖరివల్ల సీమ ప్రాజెక్టులకు నికరజలాలు దక్కలేదన్నారు.

ఇదే కొప్పర్తి పారిశ్రామిక కేంద్రంలో గతంలో ఏర్పాటు చేయాలనుకున్న డీఆర్డీఏ సంస్థ కూడా ఎటో వెళ్లిపోయిందన్నారు. అపారమైన ఖనిజ సంపద, సువిశాలమైన మైదాన భూములు, సమృద్ధిగా మానవ వనరులు కలిగిన రాయలసీమను విస్మరిస్తే భవిష్యత్తులో తెలంగాణ తరహా ఉద్యమానికి ఊపిరి పోసినట్లేనని రాష్ట్ర విభజనలో ఏర్పాటైన శివరామకృష్ణయ్య కమిటీ హెచ్చరించిందని వారు గుర్తు చేశారు.

మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్

చింతకొమ్మదిన్నె : మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ తెలిపారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఆయన చట్టాలపై అవగాహన కలిగించి మాట్లాడారు. గృహహింస, వరకట్న వేధింపులు, మహిళల పట్ల క్రూరత్వం, లైంగిక వేధింపులు, అపహరణ, యాసిడ్ దాడులు, అత్యాచారం , గ్యాంగ్ రేపులు, మహిళలకు సమాన పనికి సమాన వేతనం, తదితర అంశాల గురించి చట్టాలను వివరించారు. కార్యక్రమంలో న్యాయవాది శ్రీదేవి, హసీనా, ఈవో పీఆర్డీ శ్రీధర్, సీఐ శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వివిధ అలంకారాలలో అమ్మవారు

పులివెందుల టౌన్ : పట్టణంలోని అమ్మవారి ఆలయాలలో మూడవ రోజు శనివారం వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని శ్రీఅర్ధనారీశ్వర అలంకారంలో తీర్చిదిద్దారు. అంకాలమ్మ ఆలయంలో శ్రీమోహినిదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. పట్టణంలోని గాయత్రి నగర్ కాలనీలో వెలసిన గాయత్రీమాత ఆలయంలో శ్రీమహాలక్ష్మి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లె గ్రామంలోని మాలే గంగమ్మ ఆలయంలో శ్రీఅన్నపూర్ణదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

కమలాపురం : పట్టణంలోని అమ్మవారిశాలలో మూడో రోజు శనివారం శ్రీ రాజరాజేశ్వరీదేవి అలంకారంలో దర్శనమిచ్చి భక్తులను కనువిందు చేశారు. రాత్రి లక్కీడిప్ ద్వారా విజేతలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు.

వల్లూరు : స్థానిక శ్రీవాసవీ ఆర్య వైశ్య కళ్యాణ భవనంలో శనివారం రాత్రి అమ్మవారు ధనలక్ష్మీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆర్య వైశ్యులు పాల్గొని అమ్మవారికి కాయ కర్పూరాలను సమర్పించారు.

వీరపునాయునిపల్లె : దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా మూడవ రోజు తలపనూరు గంగమ్మతల్లి, సంగమేశ్వరాయలంలో పార్వతీదేవి గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమివ్వగా గడ్డంవారిపల్లె రాజ రాజేశ్వరీదేవి, అనిమెల బోగాదమ్మ, కీర్తిపల్లె నల్లనమ్మతల్లి అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

సింహాద్రిపురం : పాతూరు చౌడేశ్వరిదేవి ఆలయంలో శనివారం అమ్మవారు శ్రీమహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

కొండాపురం : దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు మండల పరిధిలోని దత్తాపురం పునరావాస కేంద్రంలో శనివారం శ్రీ పెద్దమ్మతల్లి దేవాలయంలో అన్నపూర్ణదేవి అలంకారంలో దర్శనమిచ్చింది.

వేముల : గొల్లలగూడూరు గ్రామంలోని నల్లనమ్మ అమ్మవారు శనివారం శ్రీపార్వతీదేవి అలంకారంలో భక్తులు దర్శనమిచ్చారు.

ముద్దనూరు : స్థానిక శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు శ్రీ మీనాక్షిదేవి అలంకారములో భక్తులకు దర్శనమిచ్చారు.

వల్లూరు (చెన్నూరు) : పడమటి వీధిలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో జగన్మాత అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్త జనులకు దర్శనం ఇచ్చారు. మానవ కోటి మనుగడకు అవసరమైన ఆహారం అందించే అన్నపూర్ణాదేవి అవతార విశిష్టతను పురాణ గ్రంథాల ద్వారా ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. అన్నపూర్ణాదేవిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను ఏర్పాటు చేశారు.



పులివెందులలో...అర్ధనారీశ్వర అలంకారంలో



కమలాపురంలో...రాజరాజేశ్వరీదేవి అలంకారంలో



జమ్మలమడుగులో... అన్నపూర్ణదేవి అలంకారంలో



సింహాద్రిపురంలో... శ్రీమహాలక్ష్మీదేవి అలంకారంలో



వీరపునాయునిపల్లెలో గాయత్రీదేవి అలంకారంలో



వల్లూరులో... ధనలక్ష్మీ అలంకారంలో



వేములో... శ్రీపార్వతీదేవి అలంకారంలో



ముద్దనూరులో... శ్రీమీనాక్షిదేవి అలంకారములో



చెన్నూరులో... అన్నపూర్ణాదేవి అలంకారంలో